# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-07-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఎన్డీయే భాగస్వామ్య పక్షాల పార్లమెంట్ సభ్యులతో ఈ రోజు సమావేశమయ్యారు.**

**2. రాజధాని అమరావతి పరిస్థితిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రేపు శ్వేతపత్రం విడుదల చేయనున్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.**

**3. రాష్ట్రంలో పారదర్శకంగా ఉపాధ్యాయ బదిలీలను చేపడతామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు**

**4. శాసనసభ్యుల కోటాలో ఎన్నిక జరిగే రెండు శాసనమండలి స్థానాలకు ఎన్డీయే కూటమి అభ్యర్థులను ప్రకటించింది.**

**5. రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్షను ఆగస్టు 5 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించేలా ప్రభుత్వం టెట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.**

===========================

మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఎన్డీయే భాగస్వామ్య పక్షాల పార్లమెంట్ సభ్యులతో తొలిసారిగా నరేంద్ర మోదీ ఈ రోజు సమావేశమయ్యారు. ఢిల్లీలో నిర్వహించిన పార్లమెంటరీ సమావేశంలో ప్రధానమంత్రితో పాటు కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజనాధ్ సింగ్‌లతో సహా పలువురు ఎన్డీయే ఎంపీలు పాల్గొన్నారు. సమావేశం అనంతరం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రీజిజు పాత్రికేయులతో మాట్లాడుతూ దేశానికి ప్రాధాన్యతను ఇస్తూ ప్రతి పార్లమెంట్ సభ్యులు పనిచేయాలని ప్రధానమంత్రి దిశ నిర్దేశం చేశారని తెలిపారు. ఏ రాజకీయ పార్టీకి చెందిన వారైన దేశ సేవ చేసేందుకు కృషి చేయాలని ప్రధాన మంత్రి సూచించారని మంత్రి పేర్కొనారు. మరోవైపు రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం పై పార్లమెంటులో జరిగిన చర్చకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు సమాధానం ఇస్తారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

---------------------------

గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రాజధాని అమరావతి పరిస్థితి, భవిష్యత్ కార్యాచరణపై రేపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్వేతపత్రం విడుదల చేయనున్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. నిన్న వెలగపూడి

సచివాలయంలో పురపాలకశాఖ మంత్రి నారాయణ, సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించారు. రాజధాని పనుల్ని పునః ప్రారంభించేందుకు చేపట్టాల్సిన చర్యలపై కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. శ్వేతపత్రంలో పొందుపరచాల్సిన అంశాలపై అధికారులకు సూచనలు చేశారు.

---------------------------

పారదర్శకంగా ఉపాధ్యాయ బదిలీలను చేపడతామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. అమరావతిలో ఈరోజు నిర్వహించిన ప్రజాదర్బార్‌లో మంత్రిని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిసి ఎన్నికల నియమావళి వల్ల నిలిచిన బదిలీ ఉత్తర్వుల అమలుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై మంత్రి స్పందిస్తూ, గత ప్రభుత్వంలో ఉపాధ్యాయల బదిలీల్లో అవకతవకలు జరిగాయయన్నారు. నిబంధనల ప్రకారం వివాదరహితంగా ఉపాధ్యాయ బదిలీలు చేపడతామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలో శాసనసభ్యుల కోటాలో ఎన్నిక జరిగే రెండు శాసనమండలి సభ్యుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్డీయే కూటమి అభ్యర్థులను ప్రకటించింది. వారిలో తెలుగు దేశం పార్టీ నుంచి ఆ పార్టీ సీనియర్ నాయకులు సి. రామచంద్రయ్యకు అవకాశం కల్పించింది. అలాగే మరో స్థానాన్ని జనసేనకు కేటాయించింది. జనసేన అధ్యక్షులు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కు రాజకీయ కార్యదర్శిగా ఉన్న పి. హరిప్రసాద్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించింది . వీరు ఈరోజు ఎమ్మెల్సీ స్థానాల ఉపఎన్నికకు నామినేషన్ వేయనున్నారు. కాగా సార్వత్రిక ఎన్నికలకు ముందు ఖాళీ అయిన రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఈ నెల 12న ఉప ఎన్నిక జరగనుంది.

---------------------------

రాష్టంలో ఒకేరోజు 95 శాతం మందికి పైగా లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశామని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి గత రాత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, నిన్న ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల్లోపు 61,76,188 మందికి, 4,169.49 కోట్ల రూపాయలను అందించామన్నారు. నిన్న పింఛన్లు పొందని లబ్ధిదారులకు ఈ రోజు పంపిణీ చేస్తామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నూతన నేర చట్టాలపై న్యాయ వాదులు అవగాహన కలిగి ఉండాలని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. కడప నగరంలో నిన్న నూతన న్యాయ చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యా అధినియమ్‌లోని సెక్షన్లను న్యాయవాదులు పూర్తిగా అవగాహన చేసుకోవాలని చెప్పారు. సాంకేతిక అంశాలతో కొత్త చట్టాల రూపకల్పన అభినందనీయమని పేర్కొన్నారు.

---------------------------

ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించిన ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు ఉన్నత విద్యామండలి నోటిఫికేషన్ జారీ చేసింది. కౌన్సెలింగ్ ప్రక్రియలో నమోదు చేసుకునేందుకు ఈ రోజు నుంచి ఈ నెల 10 వరకు అవకాశం కల్పించినట్లు అధికారులు తెలిపారు. కోర్సులు, కళాశాలల ఎంపిక ఐచ్ఛికాల నమోదుకు ఈ నెల 11

నుంచి 15 వరకు అవకాశం కల్పించారు. 19 న సీట్ల కేటాయింపు ఉంటుందని, ప్రవేశాలు పొందిన అభ్యర్థులు 22వ తేదీ లోపు కళాశాలల్లో చేరాలని పేర్కొన్నారు. ఎన్‌సీసీ, దివ్యాంగులు, మాజీ సైనికోద్యోగులు, క్రీడాకారుల ధ్రువపత్రాల పరిశీలనకు విజయవాడలోని ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల, విశాఖపట్నంలోని డాక్టర్ వీఎస్ కృష్ణ కళాశాల, తిరుపతిలో ఎస్వీ విశ్వవిద్యాలయం సహాయ కేంద్రాలకు హాజరుకావాల్సి ఉంటుందని ఉన్నత విద్యామండలి తెలిపింది.

---------------------------

రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష –టెట్ ను ఆగస్టు 5 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు టెట్ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం నిన్న విడుదల చేసింది. సిలబస్, పరీక్ష విధానం తదితర వివరాలను నోటిఫికేషన్‌లో పేర్కొంది. టెట్ దరఖాస్తు రుసుమును రేపటి నుంచి 16 వరకు, దరఖాస్తుల సమర్పణకు 4 నుంచి 17 వరకు అవకాశం కల్పించారు. ఆన్‌లైన్ నమూనా పరీక్షలకు 16 నుంచి ప్రశ్నపత్రాలను అందుబాటులో ఉంచుతామని అధికారులు తెలిపారు. ఆగస్టు 5 నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించే టెట్ పరీక్షలకు హాల్‌టికెట్లు ఈనెల 25 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. పరీక్షల అనంతరం ప్రాథమిక 'కీ'ని ఆగస్టు 10న, తుది కీని 25న విడుదల చేస్తారు. ఆగస్టు 30 టెట్ ఫలితాలు ప్రకటిస్తారు.

---------------------------

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. నిన్న శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గ పరిధిలోని వేల్పుమడుగు గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతీ నెల 1వ తేదీనే లబ్దిదారులకు వారి ఇంటివద్దే పింఛన్ నగదును అందించడం జరుగుతుందన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తామని మంత్రి పేర్కొంటూ ,

వాయిస్ ( 28 సెకన్లు)

---------------------------

పీఎం సూర్య ఘర్ పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ విజయన్ తెలిపారు. ఈ పథకం కింద కింద ఇంటి పై కప్పు పై సౌర ఫలకాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తును వినియోగించుకోవడంతో పాటు మిగిలిన విద్యుత్తును డిస్కంలకు విక్రయించుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. సౌర ఫలకాలను ఏర్పాటు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం రాయితీ ఇస్తోందని, ఈ పథకాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

---------------------------

ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణంపై త్వరితగతిన అధ్యయనం అవసరమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుతో కలిసి మంత్రి పలు అంశాలపై ఆర్టీసీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు అందించవలసిన ఆర్టీసీ సేవలు, బస్సులకు మరమ్మతులు వంటి అంశాలపై చర్చించారు. ఉచిత ప్రయాణంపై విధివిధానాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టులో అంతర్జాతీయ నిపుణుల బృందం పర్యటన కొనసాగుతోంది. పర్యటనలో భాగంగా ఈ రోజు బృంద సభ్యులు, జలవనరుల శాఖాధికారులు, ఏజెన్సీ ప్రతినిధులతో, ప్రాజెక్టు నిర్మాణం, పురోగతిపై తీసుకోవాల్సిన నిర్ణయాలు, జాగ్రత్తలు, చేయాల్సిన పనులపై సమీక్షిస్తారని అధికారులు తెలిపారు. కాగా నిన్న నిపుణుల బృందం గోదావరి వరదల ఉధృతికి దెబ్బతిన్న డయాఫ్రం వాల్ ప్రాంతాన్ని, క్షేత్రస్థాయిలో నిర్మాణాన్ని పరిశీలించారు. ప్రాజెక్టు నిర్మాణ పనుల తీరును అధికారులు వివరించారు. అలాగే, ఎగువ కాఫర్ డ్యాం నుంచి ఊట నీరు వస్తున్న ప్రాంతాన్ని పరిశీలించి, మట్టి నాణ్యతా ప్రమాణాలపై ఆరా తీశారు. ఎగువ కాఫర్ డ్యాంపై జరుగుతున్న నిర్మాణ పనులు, అక్కడ సేకరించిన మట్టి నమూనాలను బృందం సభ్యులు పరిశీలించారు.

---------------------------

ఖరీఫ్ కార్యాచరణపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. నిన్న విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న విత్తనాలు, ఎరువులు, ఖరీఫ్ ప్రణాళిక అమలు, ఎరువుల నాణ్యత పరీక్షలు, పంట రుణాలు తదితరాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నిర్దిష్ట ప్రణాళికతో ఖరీఫ్ సాగును విజయవంతం చేసేలా కృషి చేయాలన్నారు. ఎరువులు, పురుగు మందుల వినియోగంపై రైతులకు సరైన విధంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.

---------------------------

కాకినాడ జిల్లాలో పర్యటిస్తున్న ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని ప్రధాన సమస్యలతోపాటు పంచాయతీరాజ్, గ్రామీణ నీటిపారుదలశాఖల పరిధిలోని పలు సమస్యలపై అధికారులతో చర్చించారు. ఆ సమస్యలపై పరిష్కారం కోసం నివేదికలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

======================